అద్దాలం

దుమ్మూ ధూళీతో నిండివుండే ఇరుకు సందులనుంచీ, అగ్గిపెట్టెలవంటి వెలుతురులేని కొంపల నుంచీ మేము ఇవతల పడ్డాము. ప్రాణానికి ఎంతో హాయనిపించింది. అసలుమావారు ఎప్పటినుంచోఅంటున్నారు. "కాలనీలో, మనకి "క్వార్టర్సు ఇస్తారు. వెడదాము హాయిగా ఉంటుంది" అని. వారి మాటని నేనే పెడచెవినిపెట్టి తోసిరాజన్నాను. ఆ వాతావరణం నుంచి బయట పడింతరువాతగాని తెలియలేదు నాకు, మేము ఎంతటి మురికి వాతావరణంలో ఇన్నాళ్లూ ఉన్నామో ?

"కాలనీ"లో ఒక వరసలో తీర్చిదిద్దినట్టు కట్టి ఉన్నాయి ఇళ్ళు, అందంగా "షైపు" ల వారీగా. ప్రక్కనే ఉన్న కృష్ణానదిలోనుంచి వచ్చి వొంటికి హాయిని కలిగించే చల్లనిగాలి. ఇళ్ళ చుట్టూ విశాలమయిన ఆవరణ మొక్కలు పెంచుకోవటానికి అనువుగా వున్నది. చక్కగా గాలీ, వెలుతురూ ధారాళంగా వచ్చేట్టు పథకం ప్రకారం కట్టిన ఇళ్ళు. 'ఎలక్ట్రిసిటీ', "ఫ్లష్ అవుట్" దొడ్లూ వీటితో అధునిక సౌకర్యాలన్నీ అమర్చి ఉన్నవి. నా మటుకు నాకు ఈ వాతావరణం ఎంతో హాయిగా అనిపించింది. అన్నీ సర్దుకుని స్తిమిత పడటానికి రెండురోజులు పట్టింది. ఆ సాయంత్రం "స్టోర్సు"కి వెళ్ళివస్తున్నాను. పరధ్యానంగా వస్తున్న నన్ను పేరుపెట్టి పిలిచిన పరిచిత కంఠధ్వని విని ఆశ్చర్యపడుతూ తలతిప్పి చూశాను. సుమిత్ర కాదుగదా ? ఇంతవరకూ తనను చూడనేలేదు.

నావొంక, చెయ్యెత్తి వూపుతూ రమ్మని సైగచేస్తున్నది ఎవరు ?

సన్నగా నాజూకుగా ఉన్నది. "స్లీవ్ లెస్"జాకెట్, చెవులకిరింగులు, ఫాషన్ గా ముడిచి ముడివేసిన జుట్టు, చేతిలో 'ప్లాస్టిక్ బుట్ట'. ఆమె ప్రక్కన అవే వేషభాషలలో మరొకామె వున్నది, ఇంకా ఆడంబరంగా.

పాలడుగు వెంకటేశ్వరరావు
బి. ఎ.

"హలో! లలితా! మరిచేపోయావా?" అన్నదామె. అప్పటికిగాని గుర్తువచ్చేనుకాదు పూర్తిగా. అవును ఆమె సుమిత్ర. నాకు బాల్యస్నేహితురాలు. "నన్ను క్షమించు సుమీ! పరధ్యానంలో గుర్తు పట్టలేక పోయాను" అన్నాను.

"దానికేమిగాని, అయితే వొచ్చేశారన్న మాట. మొన్నే వారు అన్నారు అలాగని. బాగుంది. అన్నీ

సర్దుకుని స్థిమితపడ్డావా?" అంటూ నవ్వుతూ చేతులూపింది సుమి. ఏదో జ్ఞాపకం వచ్చినట్లు "అన్నట్లు నీకు వీరిని పరిచయం చేస్తాను. వీరు రాజీరెడ్డి. ఇక్కడ లేడీస్ క్లబ్ సెక్రటరీ. చాలా ఉత్సాహంగా ఉంటారు. ఈమె నా స్నేహితురాలు లలిత. వీళ్ళశ్రీవారూ ఇక్కడే పనిచేస్తున్నారు. ఇన్నాళ్ళూ సిటీలోవుండి మొహం మొత్తింది కాబోలు. కాలనీకి మార్చేశారు మకాము. చాలా మంచిపనిచేశారు" అంది సుమిత్ర కొంటెగా.

నేను చేతులు కలిపి నమస్కారం చేశాను. ఆమె అలవోకగానవ్వి, సుతారంగా నా నమస్కారం స్వీకరించినట్లుగా సంజ్ఞ చేసింది. తరవాత ఆవిడ నన్ను ప్రశ్నలడగడం, నేను సమాధానం చెప్పడం జరిగింది.

ఆమె వేసిన ప్రశ్నలు ఇట్లాంటివి. "మీ వారేం చేస్తారు? మీకు ఏ సైపు ఇల్లు ఇచ్చారు? ముందు ముందన్నా పై తరగతి ఇలు దొరుకుతుందా? మీ వారి జీతమెంత? మీకు కట్నం ఎంత ఇచ్చారు? మీ అత్తవారు బాగా ఉన్నవారేనా?"

ఎంతప్రయత్నించినా, నాకుగుండె దడ ఆగలేదు. గాభరాగా సమాధానాలు ఇచ్చాను. అంతకుమించి నాతో మాట్లాడటానికి ఆవిడకి విషయాలేమీ దొరకలేదా? అనిపించింది. అక్కడ నిల్చొనబుద్ధికాలేదు. పని వున్నదనిచెప్పి ఇద్దరి దగ్గరా సెలవు తీసుకుని వచ్చేశాను. సుమిత్ర నా దగ్గర ఇంటి నంబరుఅడిగి తెలుసుకుని మర్నాడు వస్తానని వాగ్దానం చేసింది.

ఆ సాయంత్రం మావారికి ఈ విషయాలన్నీ చెప్పాను. ఆయన చిన్నగానవ్వి మాట్లాడకుండా ఊరుకున్నారు.

ఆ మర్నాడు సుమిత్ర మా ఇంటికి వచ్చింది.

కాసేపు కబుర్లయాక "కాఫీ" ఇచ్చాను. కాఫీ తాగుతూ, తను బాగ్‌లోనుంచి ఒక పుస్తకం బయటికి తీసింది. ఇది క్లబ్ చందా రశీదు పుస్తకం. ఇక్కడ లేడీస్ క్లబ్ వుంది. అన్ని గేమ్సూ ఉన్నాయి. చక్కగా కుట్టుపని, అల్లికలు, డ్రాయింగు, అన్నీ నేర్చుకోవచ్చును. అప్పుడప్పుడు పార్టీలవీ వుంటాయి. చాలా బావుంటుందిలే. నిన్నూ మెంబరుగా చేర్పిద్దామని వచ్చాను" అని నవ్వింది సుమిత్ర.

"చందా ఇచ్చి మెంబరవక తప్పదంటే అవుతానుగాని నేను క్లబ్‌కి రావటానికి వీలవుతుందా అని భయపడుతున్నాను" అన్నాను నవ్వుతూ.

"నీ మొహం. మగవాళ్ళని ఆఫీసుకి పంపాక ఏమితోస్తుంది? రోజూ క్లబ్‌కి వచ్చేవంటే ఇటు నలుగురితోనూ పరిచయం అవుతుంది. తోచకపోవటమూ వుండదు. నేనువుంటాను. ఇంకా, ఈ సైపుల నుంచి చాలామంది వస్తారు." అని రశీదు రాసేసి డబ్బు తీసుకుని వెళ్ళిపోయింది. సుమిత్ర చెప్పినదీనిజమే. కాని నాకు వీలవుతుందా అన్నదే నా సమస్య.

నెల నెలా తనేవచ్చి చందా వసూలు చేసుకుని వెళ్ళిపోయేది సుమిత్ర.

తరువాత ఆరునెలల కాలంలో నేను ఏవోకటి రెండుసార్లో అక్కడికి వెళ్ళి ఉంటాను. క్లబ్‌లో నన్ను ఒక్కరూ మాట్లాడించిన పాపాన-పోలేదు. పైగా కొందరు నన్ను పైనుంచి కిందికి ఎగాదిగా చూశారు. సుమిత్ర కనబడే వరకూ నాపని పొడ్డున పడిన చేపవంతు అయింది. ఒకనాడు సుమిత్రవచ్చి చెప్పింది. "వొచ్చే స్వతంత్ర దినం సందర్భాన క్లబ్‌లో ఆటలపోటీలు ఏర్పాటు చేస్తున్నారు. నేను అన్నిటిలోన్నూ పాల్గొంటున్నాను. నువ్వూ పాల్గొంటావా?" అని అడిగింది.

"నేను పాల్గొననుగాని, వొచ్చి చూస్తానులే" అన్నాను. అక్కడికి సంతృప్తిపడి వెళ్ళిపోయింది సుమిత్ర. ఆనాడు సాయంత్రం మూడింటికి పోటీలు చూద్దామని వెళ్ళాను. జనం బాగానే వచ్చారు. బయట కుర్చీలు



వేశారు. ఒకటీ, అరా.కాళీ కుర్చీలు ముందు వరసలో వుండటాన నేను వెళ్ళి ఒకదానిలో కూర్చున్నాను.

ఆటల పోటీలు బాగా జోరుగా సాగుతున్నాయి. దాదాపు ప్రతిదాని లోనూ సుమిత్ర పాల్గొంటూవున్నది; చాలా వాటిలో గెలుపుకూడా సాధిస్తున్నది. ఇంతలో క్లబ్ మనిషి నా దగ్గరకువొచ్చి చెవిలో రహస్యం చెప్పినట్టు చెప్పింది.

"మీరు కూర్చున్న కుర్చీ సెక్రటరీ గారికోసం' వుంచింది. వారు ఇప్పుడు వస్తున్నారు. మీరు కాళీ చెయ్యగలరా ?" అని. నేనులేచి ఒక ప్రక్కగా నిలబడ్డాను.

నల్ల కళ్ళజోడు సవరించుకుంటూ మొహాన చిర్నవ్వు వెలిగిపోతూ వుండగా అందరి దగ్గర్నుంచీ నమస్కారా లందుకుంటూ వొచ్చింది రాజీరెడ్డి గారు. నన్ను చూసీ, చూడనట్టు నటించింది.

"ఆమె ఎవరు ?" తెలీనట్టు నా ప్రక్క నేనుంచున్నావిడని అడిగాను. "ప్రాజెక్టు మేనేజరుగారి భార్య రాజీరెడ్డిగారు. క్లబ్ సెక్రటరీ" అందామె వింతగా నా వొంక చూస్తూ.

"రాజీరెడ్డేమిటి ? ఆవిడ పేరు రాజీనా ?" అన్నాను.

"కాదండి. ఆయనపేరు రెడ్డిగారు ఈవిడ అసలుపేరు రాజమ్మగారు. ఫేషన్ కని రాజీ అయింది. అంతే" అని ఆమె ఆ మాత్రం తెలియదా అన్నట్టు మొహంపెట్టి ఆటలు చూడటంలో మునిగిపోయింది.

రాజీగారు ఎవర్నో తనపక్కన కూర్చున్నావిడని అడుగుతున్నారు మందహాసంచేస్తూ.

"'గేమ్స్'లోఎవరు వస్తున్నారు?"

"సుమిత్రండి"

"ఏ సుమిత్ర ? "ఎమ్" టైపు సుమిత్రా ? లేక "పీ" టైపు సుమిత్రా ?"

"పీ టైపేనండి"

"ప్చ ! ఈ పీ టైపు వాళ్ళకి తిండి తక్కువగదా ! జీతాలూ తక్కువాయె! తేలిక మనుషులు. బాగా పరిగెడతారు మరి ! !" అని బిగ్గరిగా నవ్వింది "జోక్" కట్ చేసినట్టు. చుట్టుపక్కల వాళ్ళు శ్రుతి కలిపేరు, మెప్పుకోసము. నాకు అక్కడ ఉండ బుద్ధిగాలేదు.

ఆగస్టు పదహారున తనకువచ్చిన "కప్పు"లన్నీ చూపించింది సుమిత్ర. నా సంతోషం తనకి తెలియపరిచాను. వెళ్తూ,వెళ్తూ "రేపు ఎమ్ టైపులో ఒకామె ట్రాన్స్‌ఫర్‌యి వెళ్ళిపోతున్నారు. క్లబ్బులో ఆమె గౌరవార్థము పార్టీ ఏర్పాటు చేస్తున్నారు. నువ్వూ వస్తావా ?" అని అడిగింది. రానని తల అడ్డంగా వూపాను. "అన్నట్టు జ్ఞాపకం వచ్చింది. మాకూ కొద్ది రోజులలో ఎమ్ టైపు ఇస్తారుట !" అందిఅదో పెద్ద ఎశేషమైనట్టు సుమిత్ర.

నాకు, ఆటల పోటీలు జరిగిన నాడు రాజీగారు అన్నమాటలు జ్ఞాపకం వచ్చాయి. లోలోపల నవ్వుకున్నాను. సుమిత్రనిచూసి జాలి వేసింది. తనూ, మారిపోతున్నది! వాతావరణం అట్లాంటిదిమరి!

పదిరోజులతరువాతను కుంటూను, మావారునన్నడిగేరు. "మీక్లబ్బులో పార్టీ ఏర్పాటు చేస్తున్నారటుగా?" అని. నాకు ఆశ్చర్యం కలిగింది. "ఏమిటి ? ఎందుకుట ?" అన్నాను.

"శేషగిరి అన్నాడు. సుమిత్ర చెప్పిందట ! నీకు రమణి వాళ్ళుతెలుసుగా ? వాళ్ళకి మద్రాసుకి బదిలీ అయింది. ఈ నెలలోపునే వెళ్ళిపోవాలి. రమణి గౌరవార్థం పార్టీ చేస్తారుట క్లబ్‌లో. మరి సుబ్రహ్మణ్యానికి మీరేమి చేస్తున్నారని ఇందాక శేషగిరిని సుమిత్ర అడిగిందిట ! "

మౌనంగా వింటూ ఉండిపోయాను. శేషగిరి సుమిత్ర భర్త.

"మేము పెద్దగా చేసేది లేదు గాని, నేనూ శేషగిరీ కలిసి ఒక వస్తువు ఉపయోగకరమయినది కొని సుబ్రహ్మణ్యానికి ఇద్దా మనుకుంటు



న్నాము ఎదో నువ్వూ సహకరిస్తే తలావొక కప్పు కాఫీచాలు" అన్నారు నవ్వుతూ వారు. అట్లాగేనని తలూపేను.

వారంరోజులయి, ఈమధ్యన తిరిగీ సుమిత్ర కనబడలేదు నాకు. ఆరోజు ఉదయమే నన్నుపిలిచి "మిస్టర్! ఇవ్వాళే పార్టీ. సుబ్రహ్మణ్యం రిలీవై పోయాడు. సాయంత్రం కాఫీల పూచీ నీదిసుమా" అని హెచ్చరించారు వారు. సరేననిమాట ఇచ్చాను. నలుగురికి ఏర్పాట్లు చెయ్యమని చెప్పారు వారు.

ఆ మధ్యాహ్నం సుమిత్ర వొచ్చింది. తనకి ఆసంగతి చెప్పి, "రమణికి పార్టీ ఇచ్చేరా క్లబ్బులో?" అని అడిగేను. సుమిత్ర మొహం అదోలా పెట్టి, "నేను క్లబ్బులో లేను ఇప్పుడు. ఏమిటోలెద్దూ" అని అన్నది. "ఏం?" అన్న ఆశ్చర్యంతో కూడిన నాప్రశ్నకి సమాధాన మేమీలేదు. నేను మరి సుమిత్రని నొక్కి అడగలేదు ఆ విషయం.

ఆ సాయంత్రం సుమిత్రా, రమణీ, సుబ్రహ్మణ్యంగారూ, శేషగిరిగారూ వచ్చారు. మేడమీద ఆరుబయట కుర్చీలు వేసుకుని కూర్చున్నాము. చాలాసేపు కబుర్లు చెప్పుకున్నాము. లేడీస్‌క్లబ్‌లో నుంచి లైటు బయటికి దూసుకుని వచ్చి ఎదురుగా వున్న రావిచెట్టు మీద పడుతూ వున్నది.

కాఫీలయేక సుబ్రహ్మణ్యంగారికి ఒక ఖరీదయిన పెన్ను బహుమతిగా ఇచ్చారు మావారూ, శేషగిరిగారూ. వాళ్ళు వెళ్ళటానికి లేచేటప్పటికి బాగా పొద్దుపోయింది. మర్నాడే రమణీవాళ్ళు మద్రాసు వెళ్ళిపోతారు.

వెనకాల నడుస్తూవున్న నా చెవి దగ్గర నోరుపెట్టి సుమిత్ర అన్నది. క్లబ్‌లో నుంచి వస్తున్న వెల్తురు చూశావా? నాకు ముళ్ళుగుచ్చినట్లనిపిస్తున్నది చూస్తూంటే. రమణికూడా మెంబరేగా? రమణికి పార్టీ ఇవ్వాలని అన్నాను నేను. అందరూ కాదన్నారు. రాజీరెడ్డిగారుమరీను. దానికి వాళ్లు చెప్పిన కారణంతెలుసా? పీ ౖతెపువాళ్ళకి కూడా పార్టీ ఇవ్వాలేమిటి? నెమలికీకాకికివంతా?" అంది రాజీరెడ్డి. పీ ౖతెపులో వుంటే మనుషులు కారనికాబోలు! ఎమ్ ౖతెపులో వుంటేనే పార్టీకి అర్హులట! నేను మాట్లాడలేక ఇవతలకి వచ్చేశాను. క్లబ్బు మానుకున్నాను. ఇప్పుడు హాయిగా ఉందినాకు" అని అంటూ నాచేయి నొక్కి వదిలిపెట్టింది సుమిత్ర.

***

(ఈ కథా, ఇందులోని పాత్రలూ పూర్తిగా కల్పితాలు. —రచయిత)

బి.వి. రమణరావు

(గత సంచిక తరువాయి)

4వ రంగం

అదే రంగస్థలం: తెర తీసేటప్పటికి, భానుమూర్తి, ఇందిరా సోఫాలో కూర్చుని వుంటారు. ఇందిర నిన్నటి ఉత్తరం చదువుతూ ఆలోచనలో వుంటుంది. తలుపు చప్పుడయ్యేటప్పటికి ఆతృతగా ఉలిక్కిపడి చూస్తారు. పోలయ్య కూరగాయల సంచీతో వచ్చి లోపలికెళ్ళిపోతాడు. మరో క్షణం తర్వాత రంగనాథం నెమ్మదిగా అడుగు లేసుకుంటూ దిగులుగా తలదించుకుని ప్రవేశిస్తాడు.

భా : అడుగో! ఏం రంగనాథం! ఏం జరిగిందీ?

రం : నమస్కారం బాబూ, నమస్కారమమ్మా. అయ్యగారు యింకా లేవలేదాండీ?

ఇం : లేవడానికి నిద్రపోతేగా! ఇంతకీ ఏం జేసుకొచ్చేవు?

రం : భానుమూర్తిగారు పథకం వెయ్యడంలో అపర చాణక్యులు. మరి తిరుగుంటుందాండీ!